# 14. పరదార

పట్టుదల వదలని విక్రమార్కుడు చెట్టెక్కి, శవాన్ని భుజాన వేసుకొని జాగర్తగా దిగి, మెల్లిగా నడక సాగించాడు!

శవాన్ని ఆవహించిన వీర్యభేతాళుడు ఇలా అన్నాడు: "రాజా! నీ ఆశయ మేమిటో నాకు తెలియదు. ఇంత పట్టుదలతో నీ ఆశయ సిద్ధికోసం తీవ్రంగా ప్రయత్నించటాన్ని నేను మెచ్చుకుంటున్నాను. ఐతే ప్రయత్నం వేరూ- ఫలం వేరూను. ఇది చివరి కెలా పరిణమిస్తుందోకూడా నీవు ఊహించి ఉండవు. ఆ ఫలితం ఆశించినదైనా కావొచ్చు. వెనుకటికి ద్రావిడ వీరులు పొందిన భంగపాటు లాటిదే నీ కొరకు కాచుకొని ఉన్నదేమో? నీకు శ్రమ తెలియకుండా ఉండేందుకు ఆ ద్రావిడుల కథ చెపుతాను; విను:"

భేతాళుడు కథ చెప్ప నారంభించాడు:

మానవులు చాలా అనాగరికంగా ఉన్న కాలం నాటి కథ ఇది. ఆ రోజుల్లో కొంతమంది స్త్రీ పురుషులు కలిసి ఒక ముఠాగా ఏర్పడి అరణ్యాల్లో వేటకు అనువుగా ఉండే ప్రదేశాలలో - కొండ గుహల్లోనో, లేదా చిన్న కుటీరాల్లోనో నివాసాలను ఏర్పరచుకొని, జంతువుల్ని వేటాడి బతుకుతూ ఉండేవారు. ఆనాటి మానవునికి వ్యవసాయం తెలియదు.

వయసులో ఉన్న పురుషులందరూ వేటకు వెళ్తే, స్త్రీలూ, వృద్ధులూ, బాలురూ స్థావరంలో ఉండేవారు. ఆనాటి వారి వారి సామాజికాచారాలు వేరు విధంగా ఉండేవి. పెళ్ళిళ్ళూ, పేరంటాలూ, కుటుంబమూ, సంసారమూ అనే పదాలకు వేరు

అర్థాలుండేవి. ఒక ముఠాలోని మొగాళ్ళందరూ, అదే తరంలోని స్త్రీలందరికీ భర్తలు. 'ఇది నాది- అది నీది' అనే భేదమే ఉండేది కాదు. ప్రతీదీ ఉమ్మడిసొత్తుగా భావించబడేది. ఈర్ష్యలూ, కల్లా కపటాలూ ఉండేవి కావు. సర్వ సమానత్వాన్నీ అంత బాగా ఆ తరువాత ఏ మానవసమాజమూ అమలు జరిపి ఉండలేదు.

వారు నరమాంసాన్ని కూడా నిరాక్షేపంగా ఆరగించేవారు. ఐతే వారి తెగలోని వ్యక్తుల మాంసాన్ని మాత్రం ముట్టేవారు కాదు. శత్రువుల మీద దాడి జరిపే పక్షంలో వారి స్త్రీలందర్నీ వశపరుచుకొని, తమ స్వంతం చేసుకొనేవారు; వారి బాలబాలికలను తమ గుంపులో కలిపేసుకొని తమ తెగను బలపరచుకొనేవారు. వారి పురుషుల్ని మాత్రం సంహరించి ఆ మాంసాన్ని కడుపారా ఆరగించేవారు! శత్రువుల తాలూకు ఇతర ఐశ్వర్యాలను- పశుసంపదా మొదలయిన వాటిని కొల్లగొట్టేవారు. ప్రమాదమనుకున్న శతృశేషం మాత్రం ఉంచేవారు కాదు.

ఎక్కువకాలం ఒకే ప్రాంతాన ఉండటం వారికి సాధ్యమయ్యేది కాదు. ఎందుకంటే వారు ఆహారాన్ని భక్షించే వేగానికి అనువుగా ఆహారం పెంపొందేది కాదు. జంతుజాలం కూడా మానవుల దాడికి భయపడి వేరు వేరు ప్రాంతాలకు పారిపోతూండేది.

ఆహారాన్వేషణ వారి కొక విషమ సమస్య. యెప్పుడూ కొత్త కొత్త ప్రాంతాలను కనుక్కోవటం, ఆ చుట్టుపక్కల ఇతర మానవులు లేకుండా చూసుకోవటం, సురక్షితమైన కట్టుబాట్లు చేసుకోవటం ఒక పెద్ద పని. తమవలెనే ఇతర మనుషుల గుంపులు తమ తెగమీద దాడి చేస్తాయనే భయం వారికి వుండటంలో ఆశ్చర్యం లేదు. తమ వలెనే తమచే చంపబడిన వారి మాంసాన్ని శత్రువులు కూడా వృథా చేయరని తెలుసు.

ఈ విధంగా నిరంతర భయభీతులతో, రేపెలాగా అనే సందేహంతోనే వారు కాలం గడిపేవారు. ఈ రోజుల్లో లాగు కేవలం అధికారం కోసం. తమ గొప్ప చెప్పుకొనే నిమిత్తం, తమ నమ్మకాల్ని బలాత్కారంగా నైనా ప్రచారం చేసేందుకు గాను- యుద్ధాలు జరిగేవి కావు. ప్రతి దాడికీ ఫలాపేక్ష ఉన్నది. భోగించేందుకు కొత్త కొత్త స్త్రీలు లభ్యమవటం, ఆహార సంపాదనల్లో పోటీ లేకుండా చేసుకోవటం, కొన్నాళ్ళపాటు శత్రువుల్లోని పురుషుల మాంసమే ఆహారంగా అందుబాటులో ఉండటం ముఖ్యోద్దేశాలు. చరిత్రకారు డెవరైనా సరే యీ కారణాలను గమనిస్తే – వారిది బార్బరిక జీవిత మనీ, అక్రమ పోరాట మనీ, మానవ రక్తాన్ని అనవసరంగా, అసహ్యకరంగా ప్రవహింప జేశారనీ అనలేడు సరికదా సమర్థించవలసే ఉంటుంది.

ఇక వారి స్త్రీల విషయం చూద్దాం: తాము పోషించబడుతూ పురుష సుఖాలను పొందుతూ, బిడ్డపాపల్ని చూసుకుంటూ ఆహారాన్ని తయారు చేసుకోవటమే వారి పరమావధి. తన పురుషుడు ఎవరనే ప్రశ్నే లేదు. ప్రతి స్త్రీ ఆ తెగలోని, ఆ తరంలోని ప్రతి పురుషునికీ భార్యగానే ఉంటుంది కనుక, వారి మధ్య ఈర్ష్యలు లేవు. సామాజిక

చట్టాలు నిర్దేశించిన విధంగానే ప్రవర్తించటంలో అనుకోకుండానే ఆ స్త్రీలకు కావలసినంత కామతృప్తి లభించేది. వివిధ పుష్పాలలోని మధువును గ్రోలే బుద్ధి ఉన్న పురుషునిక్కూడా యీ విధానం అత్యంతానందాన్నీ, తృప్తినీ యిస్తూండేది.

శత్రువులు దాడి జరిపినప్పుడు - నిర్భయంగా ఉండే అవకాశం స్త్రీలకూ, బాలబాలికలకూ మాత్రమే! స్త్రీకి ఏ పురుషుడైనా ఒకటే! తన పురుషుణ్ణి జయించినవాడు, సహజంగా తన పురుషునికన్న మొనగాడే ఐ ఉంటాడు కనుక, ఆ శత్రుపటాలంలోని పురుషు లందర్నీ అంగీకరించేందుకు ఆమెకు ఎలాటి అభ్యంతరమూ ఉండేది కాదు. స్త్రీ తాను కేవలం పురుషుని ఆస్తి అనే భావంలో ఉండేది. తన కో యజమాని కావాలి. ఆ యజమాని సమర్థత మీద ఆధారపడి ఉండగలగటమే ఆమె జీవితాశయం. అంతకన్న సమర్థుడైన యజమాని దొరుకుతే ఆమె కా దన వలసిన పనిలేదు సరికదా, తన అంతస్తూ, ఆనందమూ పెంపొందినట్లే భావించేది.

ఇందువల్ల 'వావి వరసలు' అనే ప్రస్తావనే లేదు. పురుషులందరికీ స్త్రీలు వారి భార్యలుగానే పరిగణించబడేవారు. అంతకు మించిన బంధుత్వం వారి మధ్య ఉండేది కాదు.

స్త్రీకి బొత్తిగా స్వాతంత్ర్యం ఉండేది కాదు; చివరకి ఆమె తనకు ఇష్టమైన పురుషుణ్ణి ఎన్నుకొనే ప్రాథమిక స్వాతంత్ర్యాని క్కూడా నోచుకోలేదు. స్త్రీని కోరవలసినవాడు పురుషుడు; తనకు ఇష్టమైన, తనకు యెక్కువ ఆనందాన్ని అందివ్వగలదనే నమ్మకం వున్న ఆడదాన్నే అతను కోరటం సహజం. తనకు ఇష్టమున్నా, లేకున్నా ఆ పురుషునికి కామతృప్తి నివ్వటం స్త్రీ బాధ్యత.

ఐతే యీ కారణంగా ముఠాలో అంతఃకలహాలు ఏర్పడే అవకాశా లున్నప్పటికీ - ప్రతి ఒక్కరికీ తెలుసు - తాను విడిపోయి ఒంటరిగా బతకటం దుర్లభమనీ, లేక ఎదిరించి నిలవటం, బతికి ఉండటం అసంభవ మనీను. అందుకని వొంతులవారీగా ఆ అనుభవాన్ని పొందటంలాటి ఏర్పాటుతో వారిలో వారు సరిపెట్టుకొనేవారు. ఇక పురుషుల్లో కూడా బొత్తిగా తారతమ్యాలు లేవని అనలేము. మహా బలాఢ్యుడే తెగకు నాయకుడుగా ఉండేవాడు. బల ముంటేనే బతుకు. బలాతిశయ మొక్కటే గణనకు వొచ్చేది. నాయకుని మాట ముఠా కంతకూ సుగ్రీవాజ్ఞ.

అతని ఆధీనంలో ఉండే వీరులు - వేటగాళ్లూ, ముఠా సంరక్షకులూ వారి వారి ప్రతిభను అనుసరించి హక్కులను కలిగి ఉండేవారు. నాయకుడు వయసు మీరుతూన్న కొద్దీ, క్రమంగా మరుగునపడిపోవటం, ఆ తరువాతి వ్యక్తి ఆ స్థానాన్ని ఆక్రమించటం పరిపాటి.

స్త్రీ పురుషులు కటి ప్రదేశంలో మాత్రమే జంతు చర్మాలను ధరించేవారు. అప్పటివారికి లోహాలు తెలియవు. అందుకని రాతితో తయారుచేసిన ఆయుధాలనే

ఉపయోగించేవారు. ఆయుధాలను తయారుచేయటం, వాటికి పదును పెట్టటం మొదలైన పనులు వృద్ధులూ, స్త్రీలూ నిర్వహించేవారు.

ఆహారం ఒక్కటే వారికి దైవ ప్రసాదితంగా ఉండేది. వారు ఆహార లేమితో బాధపడటం సంభవించేదే కాని- కామతృప్తి మాత్రం కరతలామలకంగా ఉండేది. ఐతే ఇంత విచ్చలవిడి రతిక్రీడలు - మనం అనుకునేంత తీవ్రంగా ఉండేవి కావు. నిరభ్యంతరంగా లభ్యమయ్యేదానిమీదా, తేలిగ్గా అందుబాటులో ఉన్నదానిపట్లా మానవునికి అత్యంతాపేక్ష ఉండదు కదా! వాంఛలు యెంత సహజంగా ఉద్భవించేవో, అంత సహజంగానూ తీరేవి.

అడవులలో వాటంతటవిగా లభ్యమయే ఫలాలను వారు ఆరగించేవారు. వీటిల్లో విషఫలాలేమిటో తెలుసుకునేందుకు వాటిని పశువులచేత తినిపించటం, ఆ తరువాత తెగలోని వృద్ధులకు ఆహారంగా ఇవ్వటం ద్వారా పరిశోధించేవారు.

వారికి బాగా తెలిసినవి ద్రాక్షపళ్ళు. ద్రాక్షరసాన్ని పులియబెట్టి ద్రాక్షాసవాన్ని తయారుచేసి తాగి, మత్తుగా, గమ్మత్తుగా ఉండే స్థితిని వారు కోరేవారు. ఐతే యీ ద్రాక్షపళ్ళయినా తగినన్ని దొరికేవి కావు. అందుకని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే ద్రాక్షసారాయిని సేవించేవారు. ఆహారం పుష్కలంగా లభ్యమవటమే ఆ ప్రత్యేక సందర్భం అని వేరుగా చెప్పవలసిన అవసరం లేదు.

ఆనందాన్నిచ్చేదల్లా అంగీకార యోగ్యమైనదిగా స్థూలంగా వారు భావించిన కారణంగా - 'పాపం' అనేది లేదు. అందుకని 'పుణ్యం' అనేదీ లేదు. జీవితానందాన్ని సాధించటమే వారి దినచర్య - పరమావధి!

తమకు అతీతమైన దైవశక్తులేవో ఉన్నవనే జ్ఞానం వారికి ఉండేది. దైవప్రీత్యర్థం వారు పూజలు చేసేవారు. కరువు కాటకాలు ఏర్పడినప్పుడూ,. శత్రువుల పీడ దరిదాపుల్లో ఉన్నదని అనుమానించినప్పుడూ, దాడి జరిపే ముందూ- లింగా కారంలో ఉండే ఒక రాతికి పూజలు చేసి, జంతుబలి ఇచ్చి ఆ రక్తంతో లింగాభిషేకం చేసేవారు.

కొద్దిపాటి మేకలూ, గొర్రెలూ మొదలైన పశుసంపద వారికి ఉండేది. అత్యవసర పరిస్థితుల్లో తప్ప యీ పెంపుడు జంతువుల్ని వారు ఆహారం కోసం వధించేవారు కాదు.

పుట్టినప్పుడే నెత్తుటిగుడ్డుగా జన్మిస్తామని వారికి తెలుసు. ఆ తరువాతకూడా రక్తంతోనే జీవించాలని ఎరుగుదురు. యీ విధంగా రక్తపు కూటితో, రక్తపంకంతోనే వారి బతుకులు తెల్లవారేవి. రక్తమంటే ఒకవిధంగా ఎంతో భయం ఏర్పడి పోయింది.

అందుకనే బాలింత అన్నా, మొదటిసారి రజస్వల ఐన ఆడపిల్ల అన్నా, చెరుగుమాసిన ఆడదన్నా వారికి భయోత్పాతంగా ఉండేది. అలాటి స్త్రీని వారు దూరాన ఉంచేవారు. అదే విధంగా ఆడపిల్లను కన్నెచెరనుండి తప్పించటానికి విశేష సామర్థ్యాలు

అవసరమనీ, సామాన్యుల కది దుస్సాధ్యమనీ, అథవా అందుకు పూనుకొన్న పురుషుడు అశుభాలను ఎదుర్కోవలసి ఉంటుందనే పిచ్చినమ్మకాలు వారికి ఉండేవి. ఈ కార్యనిర్వహణలో కన్నెపొరనుండి రక్తం రావటమే వారి భయానికి కారణం. ఇలాటి వాటిని యెదుర్కొని విజయవంతంగా నిలవగలవాడు– తెగనాయకుడు. నాయకుడు కూడా లోలోన భయపడినా యీ కర్మకాండల్ని నిర్వహించ నట్లయితే, అతని శక్తి క్షీణించిందని భావించబడేది. తదనుగుణంగా అతను ఆ స్థానాన్ని వొదులుకోవలసి వొచ్చేది.

ఈ రక్తానికి సంబంధించిన విషయాలు ఎంత దూరం వెళ్ళినవంటే – ద్రాక్షపండులోని రసం రక్తం వలె ఎఱ్ఱగా ఉండటంవల్ల, అది ద్రాక్షపండు రక్తంగా గుర్తించబడింది. దాన్ని విశేషంగా సేవించటం అంత మంచిది కాదనే అభిప్రాయాలు వారికి ఏర్పడినవి. అందుకనే ప్రత్యేకానందాలను ప్రకటించే సమయాలకే యీ ద్రాక్ష సారాయి ప్రత్యేకించబడింది.

తప్పనిసరై ఆ నెత్తుటి కూటినే ఆ మానవుడు ఆశ్రయించాడు. అంతరాత్మలో మాత్రం నెత్తురంటే విపరీతమైన భయం ఏర్పడిపోయింది. తన నెత్తురుకూడా ఇతరులకు ఆహారమవొచ్చనే ఊహ అతన్ని కంపింపజేసేది.

ఆకలిచావులు తప్పని పరిస్థితి ఏర్పడేట్లయితే – ముందుగా వృద్ధులను మృత్యువుకు అప్పగించేవారు. ఆ తరువాత బాలురు, ఆ తరువాత బాలికలు. ఈ బాలికల్లో పక్వదశలో ఉన్నవారిని మాత్రం బహు జాగ్రత్తగా చూసేవారు. తగినంతమంది స్త్రీలు ఉండాలేకాని, ఒకరిద్దరు పురుషులు మిగిలి ఉన్నా కావలసినంత సంతానాన్ని పొందే అవకాశాన్నిబట్టే యీ వరుస క్రమం ఏర్పడింది.

చిత్రమేమంటే– ఎంత భయం ఉంటుందో, దాన్ని జయించినప్పుడూ, లేదా దానినుంచి రక్షణ ఉన్నప్పుడూ అంత అధికంగా ఆనందం లభిస్తుంది. కొంతమంది పురుషులు వొంతుల ప్రకారం తమ గూడెం రక్షణను రేయింబవళ్ళు వేయి కళ్ళతో కాచి నిర్వహిస్తూండేవారు. ఎటూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు నిరాటంకంగా లభించినవి కనుక ప్రతిరాత్రీ మదనోత్సవాలు ఎంతో ఉత్సాహంతో కొనసాగించబడేవి.

–యిలాటి పరిస్థితులున్న కాలంలో – దండకారణ్యంలో ఒక ద్రావిడుల ముఠా కొంత ప్రాంతాన్ని ఆక్రమించి సుఖజీవనం గడుపుతున్నది. పరిసరాలలో తగినంత ఆహారం మరో వర్షఋతువు వరకూ లభ్యమవు తుందనీ, యీ సంవత్సర కాలమూ నిశ్చింతగా హాయిగా, సుఖంగా కాలం గడపవొచ్చనీ వారు అంచనాలు వేసుకొని ఆనందించారు. దాపులో ఉన్న వాగులో ఎడతెగక ప్రవహించే నీరూ, పుష్కలంగా చేపలూ దొరుకుతున్నవి.

వేట బాగా సాగిననాటి రాత్రి మధువు సేవించి, మైమరచి మదనకేళిలో స్త్రీ పురుషులు తేలియాడుతూన్న సమయంలో – పరిసరాలను పర్యటించి, దరిదాపులలో తాము భయపడవలసినది ఏమీ లేదని నిశ్చయంగా తెలుసుకొని వొచ్చేందుకు నియోగించబడిన వేగులవాళ్ళు పరుగు పరుగున వొచ్చారు.

వారి మొహాలు చూడగానే ఏదో ప్రమాదం వాటిల్లిందని అందరూ అర్థం చేసుకున్నారు.

స్త్రీ పురుషుల బంధనాలు ఎక్కడివక్కడ పటాపంచలైనవి.

పురుషులందరూ ఆలోచనా మందిరంలో గుమికూడారు. స్త్రీలు బైట పొంచి ఉండి లోని సంభాషణలను అర్థం చేసుకునేందుకు పాము చెవులతో వేచి ఉన్నారు.

వేగుల వాళ్ళిలా అన్నారు:

"ఉత్తర దిశలో ఏటి కావల మహావృక్షాల మీద పొంచి ఉండి ఆ ప్రాంతాలన్నింటినీ జాగర్తగా పరిశీలిస్తున్నాము. ఇవాళ సాయంత్రమే ఒక చిన్న ముఠా వొచ్చి, మేము ఎక్కి ఉన్న మహావృక్షానికి అల్లంత దూరంలో దిగింది. ఇరవైమంది పురుషులున్నారు: ముప్పై ఐదుమంది నవయవ్వనులైన స్త్రీలున్నారు. తెల్లని శరీరచ్ఛాయను చూసి వీరు ఆర్యులై ఉంటారనే చెప్పాలి. ఎంత నాజూకుగా ఉన్నారనీ ఆ స్త్రీలు! పురుషుల్ని మే మిద్దరమే జయించగలమనే నమ్మకం లేక, వారి చేతుల్లో చావవలసి ఉంటుందనే భయం మమ్ము ఆపింది కాని– లేకుంటే ఆ చెట్టుమీది నుంచి దూకి, ఆ స్త్రీల కౌగిళ్ళలో కరిగిపోవాలని మా మానసా లెంత ఆరాట పడినవో చెప్పలేము!

"ఎక్కడో శత్రువుల దాడిలో బాగా దెబ్బ తినో, లేక ఆహారం లభ్య మవక నీరసించిపోయో, దూరప్రయాణం చేసి ఆ ప్రాంతాలకు జేరారని చూడగానే తెలుసుకున్నాము. చాలా అలసటతో శుష్కించిపోయి ఉన్న దా పటాలం. వారి భాష వేరు. వారి నాగరికతను గమనించి, వారి దగ్గర అస్త్రాలు– మన అస్త్రాలకన్న ఉత్తమమైనవి ఉండి ఉండా లనుకుంటున్నాము. బహుశా బాణాలు వేయగల సామర్థ్యం వారికి ఉండొచ్చు. పశుసంపద వారికి లేదు. యువతీయువకులైన స్త్రీ పురుషులు మాత్రమే ఉండటాన్ని బట్టి, ఆ తెగ రూపుమాసే స్థితిలో ఉన్న దనుకోవాల్సి వొస్తోంది.

"ఈ ప్రాంతాల వారిని మననిస్తే, త్వరలోనే వారు అతి శక్తివంతులై మన తెగను నిర్మూలిస్తారనే నమ్మకం మాకున్నది. కనుక వారిని ఎదుర్కొని రూపుమాపవలసే ఉంటుంది."

పురుషులందరూ యెంతో కుతూహలంతో విన్నారు.

"వారి స్త్రీల విషయం చెప్పు–" అన్నాడు నాయకుడు.

"చెప్పేందుకు నాకు మాటలు చాలవు. ఆ అందచందాలూ, వయ్యారమూ, అంగసౌష్ఠవమూ, శరీరచ్ఛాయా, కామమే కరుడుకట్టినట్లున్న పొందికా - షండునికైనా పుంసత్వా న్నివ్వగలవని రూఢిగా చెప్పగలం. బాగా చీకటిపడేదాకా చెట్టుమీదనే ఉండి- వాళ్ళందరూ నిద్రపోయాక మెల్లిగా దిగి, పరుగుపరుగున వొచ్చి వాలాము. అందుకనే అర్ధరాత్రికి కాని స్థావరాన్ని జేరలేకపొయ్యాము-"

"మనం జయించగలమా?"

"నిస్సందేహంగా! వారి ఆయుధాలు ఉత్తమమైనవే అనుకునప్పటికీ, వారు వాటిని ఉపయోగించే సావకాశమే ఉండదు. అసలే ఆహారంలేక నీరసంగా ఉన్నారు. దూరప్రయాణపు బడలికలతో గాఢనిద్రలో ఉన్నారు. మనవాళ్ళు అరవైమందిమి ఉన్నాము. ఇప్పుడు పోయి హఠాత్తుగా వాళ్ళమీదపడితే క్షణాల్లో జయించగలం. ఆలస్యం జరిగినకొద్దీ మనకు నష్టం!"

ఆర్యస్త్రీలను గూర్చి చారులు చెపుతూంటే పురుషవీరుల మొహాలు విప్పారినవి: ఆ స్త్రీల సౌందర్యాన్ని వర్ణిస్తూంటే వారి రక్తం ఆవిరై, ఆ ఆవిర్లు మొహాలలోకి వడగాడ్పులను విసిరి విసిరి కొట్టినట్లయింది.

నాయకుడు ఒక్కసారి యోధులందరి వైపూ చూశాడు. అందరూ యెంతో ఉత్సాహంతో, యెప్పుడెప్పుడు పంచదారలాటి పరదారల పొందు పొందుతామా అనే ఆతృతను స్పష్టపరుస్తున్నారు.

నాయకుడు ప్రశ్నలు వేయదలచలేదు.

రణభేరి మోగించటంతో సభలోని కలకలం మిన్నుముట్టింది.

నరమాంస భక్షణ జరిగి పది వర్షాలైంది. ఆ కొత్త ఆహారం - అందునా ఆర్యుల తెల్లతోలుకింది రక్తమాంసాలూ కొవ్వూ ఇంకెంత రుచిగా ఉంటవోననే తహ తహతో, వారి స్త్రీలను - నాగరికుల్ని అనుభవించి, వారి రతి చాతుర్యాన్ని రుచి చూస్తూ - అక్కడే కొద్దికాలం హాయిగా గడపవొచ్చనే ఆరాటంతో ప్రతి యోధుడూ తొందరపడుతూన్నాడు. అన్నిటినీ మించి తమకు విజయం తథ్యమనే నమ్మకం వారి ఉత్సాహానికి పట్టపగ్గాలు లేకుండా చేసింది.

ఏది ఏమైనప్పటికీ - జయాపజయాలు దైవాధీనాలనే జ్ఞానం వారికి ఉన్నది. అందుకని వారొక జంతువును లింగానికి బలి ఇచ్చి, ఆ రక్తంతో లింగాభిషేకం చేశారు.

ఆ తరువాత వారి స్త్రీలు ఆచారానుసారం వీరగంధం పూయగా, ఆయుధాలు ధరించి ద్రావిడుల పటాలం సమరోత్సాహంతో ముందుకు సాగిపోయింది.

ద్రావిడస్త్రీ లందరూ గుమిగూడి గుసగుసలు ఆరంభించారు. ఈ దాడి వల్ల పురుషులకు యెంతో ఆనందమూ, దివ్యానుభూతి లభిస్తవి; అందుకే ఆ పురుషులు పడే ఆరాటం! తమకు కనీసం ఆ నరమాంసం కూడా మచ్చుకైనా ఇవ్వబడదు.

"ఈ మొగాళ్ళు యెప్పుడూ యింతే! తమ స్వార్థాలకు స్త్రీలను ఎలా బలిపెడుతున్నారో చూడు. మనం చాలక, ఇప్పుడా ఆర్యుల మూతాను మట్టుబెట్టి, ఆ నవనాగరికులైన నారీమణుల్ని తీసుకొచ్చి ఆనందంగా ఏలుకుంటారు! 'పాత రోత కొత్త వింత' అన్న విధంగా మన మీద అనవసరంగా మండిపడుతూ, ఆ ఆర్యస్త్రీలను నెత్తిమీదికి యెక్కించుకొని ఊరేగుతారు. మన యీ సవతులకు మనను దాసీలను చేసినా ఆశ్చర్యం లేదు!" అన్న దొకామె.

స్త్రీలందరూ ఆమె మాటల్ని ఆమోదించి తల లూపారు.

"ఈ పురుషుల సంగతి చెప్పుకోవాలంటే- కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందనే సామెత గుర్తొస్తుంది. వీళ్ళు అడిగినప్పుడల్లా మన యీ సుకుమార శరీరాల్ని వాళ్ళ ఇష్టానుసారంగా పీల్చి పిప్పిజేసేందుకు యెప్పుడూ, యెలాటి ఆటంకమూ చెప్పేందుకు మనకు వీలులేదు కదా! వాళ్ళకుండే ఇష్టాయిష్టాల్లాటివీ, వైవిధ్యాన్ని కోరే మనస్తత్వం మనకు ఉండనే ఉండదని వీళ్ళెలా, యెందుకు ఊహిస్తారో తెలియదు కదా! ఎప్పుడూ వాళ్ళ కామతృప్తిని మనసులో ఉంచుకుంటున్నారే కాని, ఏనాడైనా మన గొడవ పట్టించుకున్నారా? మనం ఆబలలమనీ, మనంతట మనంగా మనలేమనీ, ఆహార, విహారాలకు తమమీద ఆధారపడి ఉండాలనే కదా - వాళ్ళు మన నీ విధంగా ఉపయోగించుకుంటున్నది! రమ్మనగానే వొస్తూ, పొమ్మనగానే పోతూ వీళ్ళ అడుగులకు మడుగు లొత్తుతూ, బానిసత్వాన్ని అనుభవిస్తూ, ఈ జన్మ తరించిందని అనుకోవట మొక్కటే మనకు రాసిపెట్టి ఉన్నది. ఇంతగా మనను ఉపయోగించుకుంటారా- మనకు ఎప్పుడన్నా కాస్త నరమాంసమన్నా పెట్టి ఆదరించారా? ఆలన లేకపోయినా, పాలన ఉన్నందుకు మనం సంతోషించాలని వారి అభిప్రాయం కాబోలు!" అన్నది మరొకామె.

"ఆ ఆర్యుల ఆడవాళ్ళు యెంతో నాజూకుగా, అందంగా నవనాగరికంగా ఉంటారట! ఎలా ఉంటారో? వాళ్ళకేమైనా కొమ్ము లుంటవేమో? స్త్రీల శరీరాంగాలన్నీ ఒక్కటే కదా! మనకన్న వాళ్ళ దగ్గిర ఎక్కువేమున్నదో! ఇక రసికత్వమంటావా- మనం ప్రదర్శించలేని రసికత్వం కొత్తగా వాళ్ళ దగ్గిర ఏం వొలుకుతుందో? కులుక్కుంటూ వెళ్ళిన ఈ మొగాళ్ళకు కొత్త కొత్త అనుభవాలను వాళ్ళెలా ఇస్తారో? ముక్కూ మొహం యెరగని ఈ మోటు పురుషులు - తమ పురుషులు గాఢనిద్రలో ఉండగా జయించి తమను బలాత్కరిస్తూంటే కాముక కేళిలో ఎలా ఆనందిస్తారో? మన పురుషులు స్త్రీ శరీర సౌకుమార్యమంటే చెవికోసుకున్న విధంగానే, ఆ ఆర్యవనితలు కూడా తమకన్న నాగరికంగా ఉండే పురుషుల్ని వాంఛించరా? తెల్లతోలు ఉన్న తమ సుకుమార శరీరాల్ని,

నల్లతోలుతో నూనె కారుతూ, మోటుగా ఉండే, ఈ అనాగరికులకు అప్పగించి ఆనందిస్తారని వీళ్ళు నమ్మితే వీళ్ళెంత మూర్ఖులో వేరుగా చెప్పనక్కరలేదు!" అన్నది మరొకామె.

"మోటుసరసంతో స్త్రీని పీల్చి పిప్పి చేస్తున్నామని ఈ మొగాళ్ళు అనుకుంటారు కాని - తగినంత మోటుతనమే చూపనివాడి మొగతనం మీద మగువకు మమత ఉండదని మనకు తెలియదా? పురుషుని బలాతిశయాన్ని భరించలేని విధంగా నటించి, అతని అహానికి దెబ్బ తగలకుండా మనం కరుణిస్తున్నామే కాని, తొడకొట్టి సవాలు చేసే పక్షంలో ఈ మొగాడివల్ల ఏమవుతుందనీ? తాము ఇంతకుముందెన్నడూ రుచి చూడని మోటు సరసాన్నీ, పురుషత్వ ప్రదర్శననూ చూసి ఆ ఆర్యాంగనలు మోజుపడి, మన పురుషుల్ని మెచ్చుకుంటారనే నా నమ్మకం-" అన్నది ఇంకొకామె.

"ఈ మొగాళ్ళకేనా ఈ వైవిధ్యం? మనకేమీ అక్కరలేదా? ఆ ఆర్యపురుషులు దృఢశరీరులని, నాగరికులనీ, తెల్లగా ఉంటారనీ విన్నాం కదా! అలాటి పురుషుల్ని వాంఛించకుండేందుకు మనమేం స్త్రీ జన్మ ఎత్తలేదా?.... మన మనసులు ఉవ్విళ్లూరకుండేందుకు అవేం రాతివా? నా సామిరంగా! ఈ దాడిలో మనవాళ్ళు ఆర్యుల చేతుల్లో ఛస్తే- ఆ ఆర్యులొచ్చి మనందర్నీ ఏలుకుంటే-!"

నిజానికి ఇదే భావం అక్కడి స్త్రీ లందరికీ ఉన్నది. ఆపుకోలేని ఉద్వేగంలో మాత్రమే ఒకామె బయటపడింది. వా రందరిదీ ఒకే సమస్య కనుక అందరూ ఆ మాటల్ని ఆమోదించారు!

"ఐతే మనం మోటుగా ఉన్నందుకు ఆర్యులకు నచ్చమేమో? వారు మనను మెచ్చరేమో?" ఒకామె తన సందేహాన్ని వెలిబుచ్చింది.

"అలా ఎన్నటికీ జరగదు. పరదారలు పంచదారలే కదా? మనం వారికి కొత్త- కొత్తదనంలోనే కదా నూతనానుభూతులకు ఆస్కారం ఉండేది! ఆ ఆర్యులే మనను ఏలుకోవాలి గాని, తెల్లతోలున్నదని గర్వించే ఆర్యస్త్రీల మెడలు వొంచి, వాళ్ళచేత మనకు ఊడిగం చేయించేందుకు ఆ పురుషులే నడుం కడతారు!"

"ఆ ఖర్మ మనకు పట్టకుండు గాక!"

ఆ తరువాత ఆ స్త్రీలందరూ తమ కోర్కెలను ఈడేర్చమని లింగం దగ్గిర ప్రార్థనలు జరిపేందుకు వెళ్ళారు. వారొక జంతువును బలి ఇచ్చి, ఆ రక్తంతో లింగాభిషేకం చేసి లింగాకారానికి ప్రణమిల్లారు.

❋ ❋ ❋

అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా జరిగిన ఆ దాడిలో బహు కొద్ది సేపట్లోనే ద్రావిడులు ఘనవిజయాన్ని సాధించారు. ఒకో ఆర్య యోధుణ్ని ముగ్గురేసి ద్రావిడ యోధులు -

అదీ ఆర్యులు మైమరచి నిద్రిస్తూన్న సమయాన ఎదుర్కొంటే ద్రావిడులకు విజయం చేకూరడంలో ఆశ్చర్యం లేదు.

ప్రశాంతంగా ఉన్న ఆ అటవీప్రదేశం బీభత్సమైంది. ఆర్య యోధులందరూ బందీలు. వారి రమణు లందరూ ప్రాణ భయంతో వేరొక పక్క హాహాకారాలు చేస్తూ తమను ఎదుర్కొన్న కీడుకు దుఃఖిస్తూ, వొణికిపోతూ నిలబడ్డారు.

అప్పటికప్పుడే ముగ్గురు ఆర్యయోధులు వధించబడ్డారు. కొంతమంది ద్రావిడులు ఆ మాంసాన్ని ఖండిస్తూ కొత్త కొత్త వంటకాలు తయారుచేయ నారంభించారు! అసహాయులైన ఆర్యవీరులు – ప్రస్తుతం సజీవంగా ఉన్నవారికి – తమకు ఏం రాసిపెట్టి ఉన్నదో నిశ్చయంగా తెలుసు, పెడరెక్కలు విరిచి కట్టబడిన తాము త్వరలోనే స్వేచ్ఛ పొంది, ద్రావిడుల పొట్టల్లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందనే విషయం వారు ఎరుగనిది కాదు.

కొన్ని దివిటీలు వెలిగించబడటంతో ఆ ప్రాంతాల ఉన్న చీకట్లు దూర దూరాన మూల మూలల్లోకి నక్కినవి.

ద్రావిడుల్లో ఎవ్వరూ నష్టపడలేదు సరికదా, చిన్నగాయాల క్కూడా గురవలేదు. ఇంత గొప్ప విజయాన్ని వారింతకు ముందు యెరుగరు. ఇకముందు చూస్తామనీ అనుకోలేదు.

విచారసాగరంలో మునిగి ఉన్న ఆర్యస్త్రీలను పరిశీలించి చూశాక – చారులు వారి అందచందాలలో ఆరోవంతు కూడా వర్ణించలేదని ద్రావిడులు తెలుసుకున్నారు; చారులు కవులు కానందువల్ల యీ నేరానికి క్షమించబడ్డారు.

"మీకేమీ భయం లేదు!" అన్నాడు, ద్రావిడనాయకుడు ఆర్య స్త్రీలను ఉద్దేశించి. "మిమ్ము మేము ఏలుకుంటాము. మా తెగలో కలుపుకొని పెట్టి పోషిస్తాము. సమర్థమైన మా అండదండల్లో మీరు సుఖజీవితాన్ని గడుపుతూ, మాకు సంతానాన్ని యివ్వండి."

భాష భేదించినా భావాలు ఒకే కోవకు చెందినవి. అందునా ప్రకృతి ఆజ్ఞల్ని గూర్చిన భావాలు తీవ్రతరమైనవి కావటం వల్ల ఆర్యకాంతలు తేలిగ్గా అర్థం చేసుకోగలిగారు. భాషకు లొంగని భావ ప్రమేయమే లేదు. అనంగుని భాషా భావాలు సుగ్రాహ్యాలు కనుక ఇబ్బందేమీ కనిపించలేదు.

ఈ మాటలతో ఆర్యస్త్రీలకు ఊరడింపు కలిగింది. ఒక్కొక్కరే మొహాలు పైకెత్తి ఇక జరుగబొయ్యే దేమిటో స్పష్టంగా తెలుసుకున్నారు. హరిహరాదులు కూడా ఆపలేని ఆ సంఘటనలకు అనుగుణంగా తమతమ పాత్రలు సమర్థనీయంగా వహించేందుకు తాము సిద్ధపడటం మినహా మరో మార్గం లేదని వారికి తెలుసు. యెదిరించి ప్రాణభంగాన్ని ఆహ్వానించటం కన్న, మోకరించి మానభంగాన్ని పొంది మనటమే శరణ్యం.

నౌకా భంగమై మునిగిపోయే పరిస్థితుల్లో ఉన్న ఆ ఆర్యాంగనలకు తాము జేరేది ఏ తీరమనే ప్రశ్న లేదు. ముందుగా కాలికి నేల తగులుతే చాలనే ధోరణిలో వున్నారు.

ఆర్యస్త్రీ లందరూ ద్రావిడనాయకునికి ప్రణమిల్లారు; "ఆకలి!... ఆకలి!..." అని వారు వాపోయారు.

ద్రావిడనాయకుడు అప్పటికప్పుడే తమ గూడానికి ఆహారాన్ని తీసుకొచ్చే నిమిత్తం కొంతమందిని పంపాడు. ఇక్కడి నరమాంసం ఎటూ ఆర్యస్త్రీలు ముట్టరు. అరుదుగా దొరికిన యీ మాంసంలో ఇంతమందికి భాగా లివ్వటమూ కుదరదు.

హింసాకాండ జరిగే తావులో శృంగారం రాణించదని తెలిసిన ద్రావిడ నాయకుడు- కొంతమంది ద్రావిడ యోధుల్ని బందీలుగా వున్న ఆర్యులకు కాపలా పెట్టి- వారి స్త్రీలను మరికొంత దూరం తీసుకొని వెళ్లి, అక్కడ సమావేశ పరిచాడు.

ఆర్యస్త్రీలను అనుభవించాలని ద్రావిడులందరూ తహతహ లాడుతున్నారు! ఆ స్త్రీల లావణ్యం చూశాక వారికి మతి చలించింది. ఆతృత అంతులేకుండా పెరిగింది. ఐతే నాయకుడు ఇదంతా గ్రహించలేకపోలేదు. ఆ మాటకొస్తే ముందు ఎన్నిక చేసేది నాయకుడే కనుక, తాను కన్నువేసిన ఇద్దరు ముగ్గురు స్త్రీలను అనుభవించాలనే ఆతృత అతన్ని నిలవనీయటం లేదు. సమయం ఆసన్న మవలేదని మాత్రమే అతను వేచి ఉన్నాడు. అందుకనే, తదితర సన్నాహాలు చేయించటంలో నిమగ్నుడయ్యాడు.

కదనరంగాన్ని కామరంగంగా మార్చాలనీ, మకరధ్వజుడు తన పతాకాన్ని పటిష్ఠంగా ప్రతిష్ఠించి, వీరవిహారం చేయాలని ఈ జన్మలో తా మెన్నడూ ఊహించని విధంగా ఆర్య స్త్రీలని అనుభవించాలని నాయకుడు పథకం చేశాడు. ఆ గతాన్ని సాధ్యమైనంత వరకూ ఈ స్త్రీలు మరిచిపొయ్యేందుకు ద్రాక్ష సారాయిని వారిచేత విశేషంగా తాగించారు. ఆ మత్తులో వారు వర్తమానానికి మాత్రమే ప్రాధాన్యతను ఇస్తారనీ, సారాయి రేకెత్తించే కృత్రిమ ఉష్ణాన్ని చల్లార్చుకునేందుకు - తమ శక్తికిమించిన విధంగా పురుషుల్ని భరిస్తారని- స్త్రీల సంఖ్యకన్న పురుషుల సంఖ్య అత్యధికంగా ఉండటంవల్ల, ఇలాటిది అమలు జరుపవలసే ఉంటుందనీ - ద్రావిడ నాయకుడు సరిగ్గా అంచనాలు వేయగలిగాడు. మధువూ, మనసైన మగువలూ చేతికందగా రసాస్వాదనలో మైమరచిపోగలమని ద్రావిడులు గాఢంగా నమ్మారు.

ఎప్పుడైతే దాడికెళ్ళిన ద్రావిడుల్లో కొంతమంది ఆహార సరఫరాల కోసం గూడానికి తిరిగి వొచ్చారో- అప్పుడే ద్రావిడ స్త్రీలందరూ తమ ప్రార్థనల్ని దివ్యశక్తులు ఆలకించ లేదనీ, తన ప్రత్యర్థులకు అనుకూలంగా నిర్ణయం జరిగిందనీ గ్రహించి కుంగిపోయారు. ఆ అబలల నిట్టూర్పులతో, నిరాశలతో వాతావరణం నిండిపోయింది.

"వీళ్లు మనను ఏలుకోకపోతే మానె– కనీసం విడనాడకుంటే చాలు!" అన్న దొకామె.

ఊడిగం చేసుకుంటూనన్నా బతకగలగటం మీదనే వారి ఆశలు కేంద్రీక రించబడినవి.

"ఈ కొత్త బులపాటం ఎన్నాళ్ళులే! మనలాగే ఆ ఆర్య స్త్రీలు కూడా త్వరలోనే పాతబడిపోతారు, వాడగా, వాడగా వాడిపోకుండా ఉంటారా? అప్పుడైనా మనవాళ్ళ కళ్ళకు మనం ఆనకపోములే!" అనే ఊరడింపు వాక్యాలను విడుదల చేసిందొక వనిత.

"వీళ్ళసలు ఆ ఆర్యస్త్రీల నాగరికతనూ, సంస్కారాన్నీ, సరససల్లాపాలనూ మెచ్చుకొని, మూర్ఛపోయి– ఆ సంపర్కమే కావాలని గాఢంగా వాంఛించటం జరుగుతే– వాళ్ళతోనే కొత్త ముఠాగా తయారై, ఇటు రానే రారేమో?" అనే సందేహాన్ని వెలిబుచ్చిం దొక సరసిజాక్షి.

ఎంత చర్చించినా ఎటూ తేలకుండా ఉన్నది. ముఖ్యంగా మొగ మహారాజుల మనసు ఎంత చంచలమైనదో, దారీ తెన్నూ లేకుండా ఎటుగా ఎందుకు ప్రవహిస్తుందో ఊహించటమే అసాధ్యం. అందుకని ఎన్నాళ్ళో– తెలియని ఆ కొన్నాళ్ళవరకూ వేచి ఉండి, విధి శాసించినదాన్ని స్వీకరించటం మినహా మరో మార్గం లేదని ఆ స్త్రీలందరూ గ్రహించారు.

విచార మేఘాలు వాళ్ళ కళ్ళముందు కారునలుపు రూపాలను దాల్చి, భారంగా ఘోరంగా వేళ్ళాడినవి.

ఇక ఇక్కడ చూద్దాం:

ఆహారం అందుబాటులోకి రాగానే ఆర్యస్త్రీలు ఆవురావురుమంటూ కడుపునిండా ఆరగించారు. తాము పైకి కనిపించేటంత మోటుమనుషులం కాదనీ, సమయసందర్భాల నెరిగి మానవత్వపు ప్రాథమిక విలువలకు భంగం వాటిల్లకుండా ప్రవర్తించే పాటి సంస్కారం తమకూ ఉన్నదనీ, విజయవంతులైన ద్రావిడులు రుజూ చేసుకున్నట్లే భావించారు. ఇదే భావం ఆర్య స్త్రీలలో కూడా మొలకలెత్తింది.

తాము ఆకలిచావుకు గురి కాకుండా తమను కాపాడిన ఈ ద్రావిడులు ఘనులేననే తలపు ఆర్య స్త్రీలకు కలిగింది. అంతే కాదు– తాము నమ్ముకున్న ఆర్యుల అండలోనే మరికొద్దికాలం గడపవలసివొస్తే, ఈ ప్రయాణంలో ఆహారం అందక, ఆకలికి తట్టుకోలేక దారిలోనే ప్రాణాలు విడిచిన వారి గతే తమకూ పట్టి ఉండేది. ఈ ద్రావిడుల దగ్గిర తగినంత ఆహారం ఉండి ఉండాలి. వీళ్ళను నమ్ముకోవటమే అత్యుత్తమ మార్గమని ఆర్య స్త్రీలు గ్రహించారు. 'చచ్చిన సింహంకన్న బతికిన నక్క మేలు!' అనే సామెత తెలియని అమాయకురాండ్రేం కాదు ఆర్య వనితలు.

వృథాగా మృత్యువాత పడకుండా తమను రక్షించిన ద్రావిడ పురుషుల పట్ల ఆర్యస్త్రీలకు కృతజ్ఞతా భావ మేర్పడింది. ముందు ముందు కూడా దారుణమైన ఆకలికి ఆహుతి కాకుండా తమను రక్షించేందుకు నడుం బిగించిన యీ ద్రావిడ పురుషులపట్ల ఆశాజనకమైన భావం ఆవరించింది. పోతే రక్షించినవాడు భక్షించటంలో వింతేమీ లేదు; తాము భక్షించబడుతారు కనుకనే రక్షించబడ్డారనీ వారికి తెలుసు.

ఈ విధంగా స్వల్ప వ్యవధిలోనే ఆర్యకాంతల అంతరంగాలలో అత్యద్భుతమైన మార్పు వొచ్చేసింది. ఈ ద్రావిడులు తమకు శత్రువులు కాదు- సరికదా, ఆత్మబంధువులు. ఆ బంధుత్వాన్ని దృఢతమం చేసుకోవాలంటే, తమ పట్ల వారికి అనురాగమూ, ఆపేక్షా, అభిమానమూ లోతుగా పాతుకొని పోవాలంటే తమ తమ శృంగార చాతుర్యాలను శక్తివంచన లేకుండా ప్రదర్శించి వారిని ఆకట్టుకోవాలని ఆర్యవనిత లందరూ నిశ్చయించుకున్నారు.

అంతేకాదు - పది పదిహేను వర్షఋతువులుగా యీ ఆర్య సమాజంలోని పురుషుల చేతనే అనుభవించబడుతూ మార్పులేని జీవితాన్ని గడపటానికి అలవాటుపడ్డారు. ఎంత రుచి కరమైనదైనా, ఒకో విధానం - దాదాపు మార్పులు లేనిది విసుగనిపించక మానదు; నూతనానుభూతుల కోసం మానవుని మానసం ఉవ్విళ్ళూరుతూండటం సహజం.

ఈ వైవిధ్యం పురుషునికి లభ్యపడవొచ్చేమో కాని, స్త్రీకి దుర్లభం. అలాటిది యీనాడు ఆశించని ఫలం చేతికి అందటం కేవలం తమ అదృష్టమేనని ఆర్యకాంతలు అనుకున్నారు.

ద్రావిడులు అనాగరికులే కావొచ్చు. నాగరికులైన తమ పురుషుల ఎదుట ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా, తాము నాగరికంగానే ప్రదర్శించిన శృంగారానికి ఫలిత మేమిటి? ఆహారాన్వేషణలో కూడా తమ ఓటమిని ఒప్పుకొని తమను ఆకలిబాధకు బలిచేయటమే కదా! అదీగాక, తామందరి రసికత్వంతోనూ విశేష పరిచయమున్న ఆర్య పురుషులకు తామేం కొత్త కాదు. రోతగా కూడా వారు భావిస్తూండి ఉండొచ్చు. కాకపోతే, కొత్త కొత్త కాంతలు వారికి లభ్యమవలేదు కనుక, యీ ఉన్న కాస్త అనుభూతి కూడా పోతుందేమోనని తమను ఏలుకుంటున్నారు.

ఇక ఈనాడు - యీ ద్రావిడ పురుషుల కళ్ళకు తాము దేవకాంతలే! తమ శరీరచ్ఛాయే చాలు- వాళ్ళను బలవత్తరంగా తమవైపు ఆకర్షించేందుకు. ఇక తమ శృంగార చాతుర్యం వారికి కొత్త కనుక, ఆర్య వనితలైన తాము పన్నిన వలపు వలల్లో చిక్కుకొని, ఇదే స్వర్గసౌఖ్యమని భావించి, నమ్మేట్లు చేయగలరు.

బహుశా యీ ద్రావిడులది మోటు సరసమే ఐ ఉండొచ్చు. ఐతే అలాటిది తమకు స్వప్నానుభూతే కదా! త్వరలోనే కొవ్వు పేరుకొనిపొయ్యే అవకాశమున్న తమ

సుకుమార శరీరాలను కామకేళిలో నలిపి, నల్లేరు చేసి, పిండి పిప్పి చేయగల పురుషుల పొందే – తాము వాంఛించేది. అది లభ్యమయే సదవకాశాలు దరిదాపుల్లో ఉన్నందుకు వారందరి హృదయాలు ఉవ్విళ్ళూరినవి. తమను అధికురాం(డ్రుగా గుర్తించేందుకు సిద్ధపడిన యీ విటపటాలానికి హృదయపూర్వకంగా లొంగి పొయ్యేందుకు ఆ లలన లందరూ సంసిద్ధు లయ్యారు.

కడుపునిండా తినేందుకు చేతికందిన అరుదైన ఆర్య పురుషుల రుచికరమైన నరమాంసమూ, తృప్తిదీరా అనుభవించేందుకు సుకుమారులైన ఆర్యకాంతల నారీ మాంసమూ ఒకేసారి లభ్యపడటం దివ్యశక్తు లేవో కరుణించి ప్రసాదించిన వరమేనని ద్రావిడులు భావించారు.

కొద్దిసేపట్లోనే భయానక, బీభత్స రసాలు మాయమై శృంగారరసం ఉవ్వెత్తున వాతావరణాన్ని ముంచివేసింది.

ఇంత తేలిగ్గా, నిరభ్యంతరంగా తమను పతులుగా ఆర్యవనితలు అంగీకరించటమే కాక, ఘనస్వాగతమిచ్చి తమ కామ చాతుర్యాన్ని మనసారా సమర్పిస్తారని తలచని ద్రావిడులు– ఆ స్త్రీల ప్రవర్తనకు ముగ్ధు లయ్యారు. వారి ఆనంద తూగుటుయ్యాలల తోపుల తాపులకు ఆ కొద్ది భూభాగమూ కంపించిందనే చెప్పాలి. ఆ రాత్రిలో మిగిలిన భాగం మన్మథోత్సవాలతో ఉరకలు వేసింది. ద్రావిడులు వరుసవారీగా ఆర్య స్త్రీల పొందుపొంది, ఆ దివ్యానుభూతులకు పులకించారు.

వలపుగాళ్ళ వాడి వేడి వరపు కత్తుల ధాటిని, ఆ వయసు కత్తెలు రొమ్మిచ్చి ఎదురాడి కాచుకోవటంలో ఊహించనంత ఉత్సాహాన్ని ప్రదర్శించారు. వివస్త్రలై, వలపు వలువల్ని శరీరం నిండుగా కప్పుకొని, ఆ ఆర్య కాంతలు – ఆకాశంలో మిణుకుమిణుకుమనే నక్షత్రాల వెనుక ఉన్నదని భావించబడే స్వర్గద్వారాలే తమకొరకు తెరువబడినంతగా సంబరపడ్డారు. నీలాకాశం కింద తరుచ్ఛాయల్లోని ఆ శోభన మందిరాలు శోభిల్లినవి.

ఇంత మాత్రానికే అరగని, కరగని, తరగని తమ కామ కళా కౌశలాన్ని ఇంతకు ముందెన్నడూ ద్రావిడులు ఎరగని విధంగా ఆ వనితలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఇంతగా ముందెప్పుడూ ప్రదర్శించేందుకు మనసు రాక, తాము ఊహించి, సాధ్యమా, కాదా అనే సందేహంలో ఉండి ప్రయోగించేందుకు భీతిల్లిన సహజ, అసహజ, అక్రమ, చిత్ర విచిత్ర, రతి విధానా లన్నిటినీ, ఒకరిని చూసి మరొకరు మరింత ఉద్రిక్తులైన ఆ ఆర్యాంగనలు– విచక్షణా జ్ఞానాన్ని విడనాడి, నిరాటంకంగా, నిర్భయంగా ద్రావిడులకు రుచి చూపారు. ఒక్కో ద్రావిడ పురుషుడు తాను అనేకమంది స్త్రీల దగ్గిర పొందదగిన అనుభవాన్ని ఒకే స్త్రీ దగ్గర పొందగలిగినట్లు భావించక తప్పలేదు.

జలజలమని ప్రవహించే ఏటి గట్టున, కిలకిలమని నవ్వులతో ఆహ్వానించే ఆర్యకాంతలు, భగభగమని బాధించే ద్రావిడుల కామాగ్నిజ్వాలల్ని, గులగులమనే తమ దేహాలతో విజయవంతంగా చల్లార్చారు.

ఆలమందలోకి జొరబడిన మదించిన ఆబోతువలెనే ద్రావిడ విటపటాలం విజృంభించింది. సమూహ, సంబర, సంరంభ, సంభోగ సమోత్సాహంతో అక్కడి ప్రకృతి దద్దరిల్లింది.

ఆర్య స్త్రీలు తాము ఎన్నడూ ఊహించని ఈ బలవత్తరమైన పురుషత్వాన్ని మెచ్చుకున్నారు. ఇంత కామతృప్తి భూమి మీద సాధ్యమని ఆ భామలు తలిచి ఉండలేదు. కలకాలం తమ నీ ద్రావిడులు ఏలుకోవాలని ప్రతి ఆడదీ తలపోసింది.

మర్నాటి ఉదయం ఆర్య వనితలకు కడుపు నిండా ఆహారం అందివ్వబడింది. ద్రావిడులు నరమాంసాన్ని భక్షించారు.

ఆ పగలల్లా ఆర్యస్త్రీలూ, ద్రావిడ పురుషులూ దిగంబరులై ఏటిలో జలక్రీడలాడారు. ఒకరి ఉద్రేకాలను మరొకరు రెచ్చగొట్టుకుంటూ ఇంత గొప్ప దివ్యానుభూతి ఆలసిస్తే అంతర్ధాన మవుతుందేమోనన్న భీతితో బాధపడుతూన్న వారివలె, మదోన్మాదులవలె ప్రవర్తించారు. సుకుమారులైన ఈ స్త్రీలు తమ లాటి మోటు మనుషుల్ని సైతం భరిస్తూ సవాలుచేసే విధంగా కనిపించారంటే - నిజమైన రసికురాండ్రంటే వీరే ననే భావం ద్రావిడులకు కలిగింది. అంతేకాదు- తమ పురుషుల సంఖ్య- ఆర్యవనితల సంఖ్య కన్న అధికంగా ఉన్నప్పటికీ, ఏ ఒక్క ద్రావిడునికీ అసంతృప్తి లేకుండా ఆ స్త్రీలు సమర్థించారంటే- వీరు కామపిశాచినులే ఐ ఉండాలనీ, ఇలాటి స్త్రీతో రమించిన పురుషునిదే సార్థక జన్మమనీ ద్రావిడులు నమ్మటంలో ఆశ్చర్యమేమిటి?

ద్రావిడుల మనస్తత్వం ఎంతవరకూ మారిందంటే - వారి నాయకుడు "ఇక్కడ మన కీ నరమాంసం మరో ఆరు రోజుల వరకూ సరిపోతుంది. ఈ ఆరు రోజులూ మన మీ ప్రదేశాన్ని విడవవొద్దు... ఆ తరువాతైనా - మనం ఈ ఆర్య కాంతలతోనే ఉండిపోయి, మరొక సమూహంగా ఉందాం" అన్న మాటల్ని, ద్రావిడు లందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు.

ఈ మాటలు విన్న ఆర్యభామలు తమ పంట పండిం దనుకున్నారు. తమ కోరికలన్నీ సఫలమైన వనుకున్నారు.

తమపట్ల ద్రావిడుల అనురాగాన్ని మరింత బలపరచుకొనే తమ బాధ్యతను ఆ భామలు మరువలేదు. తమ చాకచక్యమంతా చూపుతూ, ఆ ఆరురోజులూ కాముకకేళిలో వొళ్ళు తెలియకుండా పాల్గొన్నారు.

ఐతే ఏడోనాడు సూర్యోదయాన ద్రావిడనాయకుడు మనసు మార్చుకున్నాడు.

"ఇక్కడి నరమాంసం ఐపోయింది. మనం మన గూడానికి ఈ స్త్రీలను తీసుకొని తిరిగి వెళ్దాం. అక్కడ మన వాళ్ళు ఎలా ఉన్నారో- పాపం!" అన్నాడు నాయకుడు.

ఈ మాటల్ని ప్రతి ద్రావిడుడూ హృదయపూర్వకంగా హర్షించాడు.

ఆర్యకాంతలకు మాత్రం ఆ మాటలు వాడి ములుకులైనవి. ఐతే పురుషునికి ఎదురాడే సాహసం లేదు గనుక వారందరూ కుక్కిన పేనులవలె ద్రావిడులను అనుసరించారు.

వారం రోజులుగా పరదారలతో పరాచికాలాడుతూ, తమను మరిచే పొయ్యారేమోనని దిగులుపడి, ఈర్ష్యాజ్వాలల్లో కాగిపోతున్న ద్రావిడ కాంతలకు తమ పురుషుల రాకను గూర్చిన వార్త మహదానందా న్నిచ్చింది.

ఐతే వారు ఆర్యవనితలతో సహా తరలి వొస్తున్నారని విన్నాక - తాము ఈ కొత్తకాంతలకు ఊడిగం చేసుకొనే గతి పట్టిందని విచారించారు.

ఏది ఏమైనప్పటికీ - తమ ఈర్ష్యాచిహ్నాలు ఏమాత్రం పైకి పొక్కనిచ్చినా ద్రావిడులు తమను తరిమేస్తారని వారికి తెలుసు. అందుకని విషపు నవ్వుల వానలు కురిపిస్తూ, విజయులై వొస్తున్న తమ పురుషులకు ఘనస్వాగతా లిచ్చి, వారి ప్రియురాండ్రుగా అవతరించిన ఆర్యభామలను ఆహ్వానించి, గౌరవించి, తమ పురుషుల ఆనందమే తమ ఆనందమని ధ్వనించే విధంగా వొళ్లు దగ్గరుంచుకొని ప్రవర్తించి, పురుషుల ధర్మాధర్మాల మీదనే తాము మన గలుగుతున్నా మనే ధోరణిని ప్రకటించి - ఆచారా న్ననుసరించి, వీరపూజలు చేయవలసిన తమ బాధ్యతల్ని వారు మరువలేదు.

ఆర్యకాంతల్ని చూస్తూనే ద్రావిడ భామలు మూర్ఛపర్యంత మయ్యారు; వారి హావభావాలూ, వయ్యారం, యవ్వనశోభా, నాగరికతా, నాజూకూ, నడక తీరూ - ఒకటేమిటి - వారి ముందు తాము దిగదుడుపేననే భావం ద్రావిడ స్త్రీలకు కలిగింది. తమ పురుషులు అన్యకాంతల పా లయ్యారనీ, అది సహజ సిద్ధాంతమేననీ, తమ కిక పురుష సౌఖ్యమే దూరమైందనీ ద్రావిడ స్త్రీలు నమ్మవలసి వొచ్చింది.

వీరపూజ లందుకొన్న ద్రావిడులు- ఆ తతంగం పూర్తికాగానే తమ స్త్రీలను బిగియార కౌగలించుకొన్నారు.

చిత్రమేమంటే ఆ రాత్రి ఆర్యస్త్రీలందరూ ఒంటరిగానే గడిపారు; ద్రావిడ స్త్రీ లందరూ శృంగార రసాస్వాదనలో తేలియాడారు. ఏనాడూ తమ పురుషులు ఇంత ఉద్ధృతంగానూ బలవత్తరంగానూ తమ అనురాగాల్ని ప్రదర్శించి ఉండలేదని ప్రతి ద్రావిడ వనితా తలపోసింది. తమను విసర్జించారని తలచిన పురుషులు ఇంత గాఢానుబంధంలో తమను బిగించటం వారిని ఆశ్చర్యంలో ముంచెత్తించింది.

ఏదో దివ్యశక్తి తమ కీ వరాన్ని ప్రసాదించి ఉండాలని ప్రతి ద్రావిడభామా భావించింది. ఆ తరువాత వారమంతా కూడా ఆర్యవనితలు ద్రావిడపురుషుల నిర్లక్ష్యతకు గురయ్యారు.

వీర్యభేతాళుడు యీ కథ చెప్పి యిలా అన్నాడు:

"రాజా! ద్రావిడుల ఈ వింత ప్రవర్తన ఎలా సమర్థనీయమవుతుంది? తమ స్త్రీలకన్న అత్యుత్తములైన ఆర్యస్త్రీల పొందులో వారు దివ్యసుఖాలను చవిచూశారు కదా! జీవితాంతం వరకూ వారితోనే వేరొక సమూహంగా ఉండిపోవాలని కూడా నిశ్చయించుకున్నారు కదా! అక్కడ దాడి జరిగిన తావులో ఆ స్త్రీలతో ఒళ్ళుపై తెలియకుండా రమించటం కారణంగా ద్రావిడులకు మొహం మొత్తిందా?

"వారం రోజులూ మైమరచిన మైథునంలో ద్రావిడులు నిర్వీర్యులయ్యారా? ఆర్యస్త్రీల యెదుట మొదట తాము ప్రదర్శించిన ప్రచండ పురుషత్వాన్నిప్పుడు ప్రదర్శించలేకపోవటంవల్ల, వారి దృష్టిలో దిగజారవలసి ఉంటుందని భావించి, వారి జోలికి పోకుండుటమే ఉత్తమ మనుకున్నారా? తమకన్న అధిక సంఖ్యలో ఉన్న ద్రావిడుల్ని అవలీలగా కామరంగంలో భరించిన ఆర్యవనితలు 'కామపిశాచినులు' అనే భావాన్ని ద్రావిడుల్లో కలిగించిన కారణంగా, ఈ పిశాచినులు ఒక 'పీడ' అనే నమ్మకం ద్రావిడులకు ఏర్పడిందా? లేక వాదోపవాదాలూ, అభ్యంతరాలూ, ఇతర ఆక్షేపణలు ఏమీ లేకుండానే – తమ పురుషులపట్ల ఎలాటి సానుభూతీ చూపకుండానే – తాము విజయులు కనుక, తమ పొందును వెనువెంటనే ఆహ్వానించి నందుకు ద్రావిడులు ఆర్యస్త్రీలను వేరువిధంగా అంచనాలు చేశారా? వీరు రేపు తమ స్త్రీలై తాము వేరొక శత్రుసమూహం చేత ఓడించబడటమే సంభవమైతే, యీ స్త్రీలు ఇప్పటివలెనే ప్రవర్తించి ఆ శత్రువుల అడుగులకు మడుగు లొత్తే కృతఘ్నులే అవుతారనే అనుమానం ద్రావిడులకు కలగటం ద్వారా ఆ స్త్రీలపట్ల వారికి నిర్లక్ష్యభావ మేర్పడిందా? వారం రోజులుగా తమ స్త్రీలకు దూరమైన కారణంగా విరహవేదన రేకెత్తి, గూడానికి రాగానే స్వస్త్రీల పొందుకోసం ద్రావిడులు ఉత్సాహంతో ఉవ్విళ్ళూరారా? లేక తమకూ, ఆర్యస్త్రీలకూ మధ్య అగాధంవలె ఉన్న సంస్కారం కారణంగా, సమానత్వాన్ని ఆశించే తమ నెయ్యాన్ని ద్రావిడులు సంహరించ దలచారా? వారం రోజులలోనే ఆర్యస్త్రీల కొత్తదనం పాతబడిపోయిందని ద్రావిడులు భావించారా? ఆర్యస్త్రీల రతికేళి కౌశలానికి ముగ్ధులైన ద్రావిడులు అంత త్వరలోనే అదంతా మరిచిపోయ్యారా? లేక స్త్రీలు కదా ఏదో పడి వుంటారు– ఎప్పుడు కావాలంటే అప్పుడే కామవాంఛలు తీర్చుకోవచ్చు లెమ్మనే ఉద్దేశ్యంతోనే ఆర్యస్త్రీలను తమ గూడానికి తోలుకొని వచ్చారా? వారం కాగానే నాయకుడు తన నిర్ణయాన్ని సరిగ్గా విరుద్ధంగా మార్చుకోవలసిన అత్యవసరం ఎందుకు ఏర్పడింది? ద్రావిడ స్త్రీల ప్రార్థనలను ఆలకించిన లింగాకారమే యీ విరుద్ధ పరిణామానికి కారణమా? తాము కొత్త కాంతలను తోడ్కొని వచ్చినా, స్త్రీ సహజమైన

ఈర్ష్యా చిహ్నాలనే ప్రదర్శించక వారిని ఆహ్వానించ గల విశాల హృదయాలున్న తమ స్త్రీలంటే ఎక్కడలేని అభిమానమూ పుట్టుకొచ్చినందువల్ల ద్రావిడులు వారిని ఆదరించారా? ఈ ప్రశ్న లన్నిటికీ జవాబు తెలిసి ఉండి కూడా చెప్పక పోయావో, నీ తల వేయి ముక్కలవుతుంది!"

* * *

విక్రమార్కుడు ఈ విధంగా జవాబు చెప్పాడు:

"వారం రోజులపాటు నరమాంస భక్షణా, మధుపానసేవా, మదన క్రీడల్లో పూర్తిగా మునిగిపోయిన ద్రావిడులకు మొదట ఉన్నంత పటుత్వం కానీ, ఆకర్షణ కానీ ఉండకుండటం సహజమే! బాగా అలసి, సొలసి మొహం మొత్తి ఉండటం సబబే; అయితే అంతమాత్రాన వారు నిర్వీర్యులయ్యారని అనలేము.

"తమ గూడానికి తిరిగి వచ్చాక ఆర్యవనితల్ని నిర్లక్ష్యం చేశారంటే– వారితోడి కలయికలో తాము పూర్వమంత తీవ్రతను ప్రదర్శించలేమనీ, అందువలన ఆ ఆర్యకాంతల దృష్టిలో తమ పురుషత్వంమీద ఏర్పడిన గొప్ప అభిప్రాయానికి దెబ్బ తగులుతుందేమోనని ద్రావిడులు తలచవలసిన పనిలేదు. ఎందుకంటే ఎన్నిక మొగాళ్ళ వంతు; స్త్రీ కేవలం కీలుబొమ్మవలె తోలుబొమ్మవలె మాత్రమే ప్రవర్తించాలి. ఆమె ప్రత్యే కాభిప్రాయమంటూ ఉన్నప్పటికీ, అది ప్రచ్ఛన్నంగానే ఉండాలి. కాని బహిరంగ పరచవలసిన అవసరం లేదు. దాన్ని బయట పెట్టడం తన నాశనాన్ని పేరుపెట్టి పిలవటమేనని ఆమెకు తెలుసు. అదీగాక, పురుషులవలెనే ఆ ఆర్యస్త్రీలుకూడా అలసటతో సొమ్మసిల్లిపోయే ఉన్నారు. ముఖ్యంగా ఒక్కో ఆర్యవనిత ప్రకృతి నిర్దేశించినదానికన్న అత్యధికమైన కామతరంగాల తాకిడిని భరించి ఉన్నందువలన, పురుషులకన్నా అధికంగా అలిసి వుండటం సహజం. అలాటి పరిస్థితులలో వున్న స్త్రీని పురుషుడు కొద్ది పురుషత్వంతోనే ఒప్పించి, మెప్పించగలడు. ఆ మాత్రం మొగతనంకూడా ద్రావిడులకు మిగలలేదని ఏ విధంగా చూసినా చెప్పలేము.

"ప్రణయ కలహాలూ, తేలికగా లొంగిపోవటం వలన ఏర్పడే తక్కువ అభిప్రాయాలూ మొదలైనవి ఆ అనాగరికులకు తెలియవు. శ్రమ లేకుండా తను పిలవగానే తన పంచచేరే స్త్రీని అనుభవించటమొక్కటే వారికి ఉగ్గుతోపెట్టిన విద్య.

"ఇక ఆర్యస్త్రీలు తమకు ఎందుకు లొంగారో కూడా ద్రావిడులకు తెలుసు. వనితలు వీరభోజ్యులని వారు ఎరుగనిది కాదు. ఎవరి స్వార్థానికి వారు పాకులాడే సందర్భాలలో ఎదుటివారి స్వార్థాన్ని మాత్రమే ఎత్తి చూపటం, గురిగింజ తన నలుపు సంగతి గమనించకుండటం లాటిదే కనుక– ఆర్య స్త్రీలపట్ల ద్రావిడుల అభిప్రాయాలు ఈ కారణంగా దిగజారి పోవలసిన అవసరం లేనేలేదు.

"తాము శత్రువుచే ఓడించబడే సంఘటనే తప్పనిసరి అయితే- అప్పుడు ఈ ఆర్యస్త్రీలవలె, తమ స్త్రీలుకూడా ప్రవర్తిస్తారు. స్త్రీ చేయగలిగిం దేమిటో దాన్నే అనుసరించటాన్ని ఎవ రాపగలరు?

"వారంరోజులుగా తమ స్త్రీలకు దూరమైన కారణంగా ద్రావిడులకు విరహవేదన ఆరంభమై ఉండొచ్చు; ఐతే ఆ వారమూ వారి శక్తికి మించిన కామకేళిలో పాల్గొనే వున్నారు. వారానికే విరహం అంత తీవ్రరూపం దాల్చుతుందనీ అనలేము.

"ఆర్యకాంతల సంస్కారం తమ సంస్కారానికి పై మెట్టున ఉన్నదని ద్రావిడులు గ్రహించినా, తాము విజయులయిన కారణంగా ఆర్య సంస్కారం తమకు కింది చేయే గనుక - ద్రావిడులకు చిన్నతన మేమీలేదు. అదీగాక, వారం రోజులుగా తాము అనుభవించిన ఈ స్త్రీలను గూర్చి యీనాడు తీవ్రంగా ఆలోచించవలసిన పనీ లేదు.

"ఆర్యస్త్రీలు, ఈ ద్రావిడుల గుంపుకు చిక్కటం ఇదే మొదటిసారి. అరుదయిన వస్తువును తేలిగ్గా అవతల పారెయ్యలేం గదా! అందునా ఇవాళ వాళ్ళ అవసరం లే దనుకొని విసర్జిస్తే, రేపు కావా లనుకున్నప్పుడు దొరుకుతారా? నవ యవ్వనవతులైన ఆర్యవనితలను తమ ముఠాలో కలుపుకోవటం వలన తమ సంపద, దానితోపాటు వైభోగం పెరగటం జరుగుతుంది. వీళ్ళక్కూడా తగినంత ఆహారం అందుబాటులో ఉన్నది గనుక వీరిని తమతోపాటే ఉంచుకుంటే- తెగలో స్త్రీలులేని లోటు ఏర్పడదు. గర్భవతులైనవారు రతిక్రీడలో ఉపయోగపడరు కనుక, ఎప్పుడూ పురుషుల సంఖ్యకన్నా స్త్రీల సంఖ్య అధికంగా ఉండనట్లయితే, పెద్ద ఇబ్బంది ఏర్పడుతుంది. అందుకని ఆర్యకాంతల్ని అంగీకరించారు.

"మానవుడు తలచనిది సంభవ మైనప్పుడూ, లేదా తాను కోరిన గొంతెమ్మ కోరిక యీడేరి నప్పుడూ దైవశక్తులేవో ఆగ్రహించటమో, అనుగ్రహించటమో జరిగిందని సరిపెట్టుకోజూడటం సహజమే. కదనానికి కదలబోయే ముందు ద్రావిడ యోధులు బలి యిచ్చి, లింగాభిషేకం చేశారు. అందుకని వారి కోర్కెలు మన్నించబడినవని మనం అనుకోజూస్తే- మరో కొత్త సమస్య తలెత్తుతోంది.

"ద్రావిడ యోధుల వలెనే- ద్రావిడ వనితలు కూడా బహు స్వల్ప కాలయాపనతో జంతుబలి యిచ్చి, ఆ రక్తంతో లింగాభిషేకం చేసి ద్రావిడులు అపజయం పొందాలని ప్రార్థించారు కదా! ఉభయుల భక్తీ ఒక్కటే; వారి పూజా పునస్కార విధానాలూ సరిసమానమే! అయినప్పుడు ఆ దైవశక్తి ఒక దానికి మరొకటి చుక్కెదురుగా ఉన్న కోర్కెలలో దేన్ని మన్నిస్తుంది? రెంటినీ కరుణించటం అసంభవం కనుక, ఇక్కడ దైవశక్తుల ప్రస్తావనే రాదు.

"తాము కొత్త కాంతలను తీసుకొచ్చినా తమ స్త్రీలు పెదవి మెదిపేందుకు వీలు లేదని ద్రావిడులకు స్పష్టంగా తెలుసు. తమ స్త్రీలు ఏ విధంగా ప్రవర్తించి తీరవలసిందీ పరిస్థితులే నిర్ణయించి, గాడిచేసి ఉంచినవి. తదనుగుణంగానే వారి ప్రవర్తన ఉండటం సాధారణ విషయమే అవుతుంది. ఇందులో 'విశాల హృదయం' లాటి పద ప్రయోగాలకు తావు లేదు.

"ఆర్యకాంతలు ద్రావిడుల కళ్ళకు కామపిశాచినుల వలెనే తోచారు. నిజానికి అలాటి స్త్రీ దగ్గరే పురుషునికి అమిత సుఖం లభ్యమౌతుంది. కనుక ఆమెనే మరింతగా కోరుతాడు. నిజానికి ఆ రతి చాతుర్యం ఆర్యవనితలకు ఉన్నది కనుకనే వారిని విడనాడరాదని అభిప్రాయపడి ద్రావిడులు వారిని తమ గుంపులో జేర్చుకున్నారు.

"వారం రోజులపాటు పంచబాణుని సేవాతత్పరతలో నిమగ్నులై – ఏడో నాడు గూడానికి తిరిగి వెళ్ళాలనే తహతహను ద్రావిడులందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. అంతే కాదు– ఆ రాత్రి తమ స్త్రీల దగ్గర విజృంభించారు. నిర్వీర్యులు తాము కా మని రుజూ చేశారు. దీనికి అసలయిన, సిసలయిన కారణం ఉండి తీరాలి.

"వారం రోజులపాటు వీరి ఆహారం ఏమిటో చూస్తే, ఈ కీలకం అర్థమౌతుంది. ద్రావిడులు ఆ వారమంతా ఆర్యపురుషుల మాంసమే కడుపారా ఆరగించారు కదా! ఆ మాంసం ద్రావిడుల పొట్టలోపడి జీర్ణమై వారి శరీర భాగంగానే రూపొందింది. కొత్త నీరు వచ్చి, పాత నీటిని ఎంతో వేగంతో తోలిపారేసినట్లయింది.

"అంటే పైకి ద్రావిడులుగానే కనిపించే వారు– అంతరాంతరాల్లో ఆర్యుల గుణగుణాలను ఆ వారం రోజులూ విపరీతంగా పెంపొందించుకున్నారు. కనుక ఆర్యవనితలు తమ స్త్రీ లనే భావం వారిలో నాటుకొని పోయింది. ఆ పాత పడతుల పొందు వారికి మొహం మొత్తింది.

"ద్రావిడ స్త్రీలు పరదారవలె వాళ్ళకు దృఢమైన అభిప్రాయం యేర్పడింది. పరదార పంచదారే గనుక వారా రాత్రీ, ఆ తరువాత వారమంతానూ విపరీతమైన మొగతనాన్ని చూపగలిగారు. ఆ కారణంగానే ఆర్యకాంతలపట్ల వారికి నిర్లక్ష్యత ఏర్పడింది."

విక్రమార్కునికి మౌనభంగ మవటంతో వీర్యభేతాళుడు శవంతో సహా తుర్రున యెగిరి మర్రిచెట్టెక్కాడు.

– జూన్, *1966*